క్లుప్తంగా

అదనపు వైద్యాధికారిని నియమించరూ..

సీతంపేట: దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండో మెడికల్ ఆఫీసర్ లేకపోవడంతో ఒక డాక్టరుతోనే నెట్టుకొస్తున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియాతో పాటు టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ఇటీవల అధికంగా నమోదవుతున్నాయి. ఒకే డాక్టర్ అందుబాటులో ఉండటంతో గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, ఆస్పత్రిలో ఓపీ సేవలు అందించడం కష్టమవుతోంది. వైద్య సేవలు సరిగా అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అదనపు వైద్యాధికారిని నియమించాలని రోగులు కోరుతున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ



ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

వీరఘట్టం: పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీఓ సత్యంనాయుడు సూచించారు. కార్యక్రమంలో టీఏ నీలిమ, సెక్రటరీ చక్రధరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మునాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా మారిన రాయుని కోనేటి మలుపు, ఛిద్రమైన రహదారి

పాలకొండ రూరల్: నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిలో పాలకొండ మీదుగా వీరఘట్టం, పార్వతీపురం వయా ఒడిశాలోని రాయగడకు వెళ్తుంటాయి. స్థానిక రాయుని కోనేటి వద్ద గల భారీ మలుపు వద్ద నిత్యం వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇక్కడే రోడ్డు సహితం పూర్తిగా ఛిద్రం కావటంతోపాటు ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో సమస్య మరింత జఠిలమయ్యింది. తాజాగా ఇదే రహదారి మలుపులో ఉన్న గ్యాస్ నిల్వల కేంద్ర సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. నిత్యం రాత్రి సమయంలో వాహనాలు బోల్తా పడుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పట్టించుకుని రహదారి పునరుద్ధరించటంతో పాటు వేగనిరోధకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

సీతంపేట: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. కిట్టాలపాడు జంక్షన్ వద్ద యువతకు రహదారి భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై కె.ప్రయోగమూర్తి సూచించారు. పట్టణ పరిధిలో ఆటో యూనియన్స్ సభ్యులు, డ్రైవర్లతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించవద్దన్నారు. ముఖ్యంగా పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లే ఆటోల డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

సందడిగా నందన్న ఉత్సవాలు

భామిని: మండలంలో నందన్న ఉత్సవాలను సందడిగా నిర్వహిస్తున్నారు. ఆదివారం గౌరీ సమేతంగా శివపార్వతులు ఆశీనులైన ఉన్న నందన్నకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా పౌరాణిక, జానపద వీధివేషాలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

ఆశాజనకంగా రాగిసాగు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో గిరిజన రైతులు సాగుచేస్తున్న రాగి పంట ఆశాజనకంగా ఉంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆరుతడి పంట కావటంతో ప్రస్తుతం ఈ పంట కంకిదశలో కళకళలాడుతోంది. మరికొన్ని రోజుల్లో చేతికి అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 320.4 హెక్టార్లలో రాగిపంట సాగులో ఉందని వ్యవసాయాధికారి సీహెచ్.ప్రసాద్ తెలిపారు.

మొక్కజొన్న సాగు.. ఆదాయం బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ గిట్టుబాటు
- జిల్లాలో 15 వేల ఎకరాల్లో సాగు
- ఎకరానికి రూ.1.5 లక్షల వరకూ ఆదాయం
- జీరో టిల్లేజ్ పద్ధతిలో దుక్కి లేకుండా నాట్లు



పసుకుడిలో యంత్ర సాయంతో మొక్కజొన్న పొత్తులు నూర్పిడి చేస్తున్న రైతులు

భామిని: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పంట సేకరణ, నూర్పిడి పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. హార్వెస్టర్ యంత్రాలతో నూర్పిడి చేసి గింజలను ఆరబెట్టడంలో రైతులు తలమునకలై ఉన్నారు. జిల్లా రైతులు పంటమార్పిడి విధానంలో భాగంగా మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. పలువురు రైతులు ఖరీఫ్ వరిసాగు పూర్తియిన తరువాత రబీలో మొక్కజొన్న సాగు చేస్తుండగా, మరికొందరు ఖరీఫ్, రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందుతూ లాభాలు ఆర్జిస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉంది. గత ఏడాది కంటే ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో అధికంగా పంటసాగు చేశారు. ఎకరాకు సరాసరి దిగుబడి 25 క్వింటాళ్ల వరకు వస్తుందని, భూసారం బట్టి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధ్యమవుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.7020గా నిర్ణయించింది. రైతుకు ఎకరాకు రూ.1 లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వర్షాధారం, సాగునీటి వనరుల అందుబాటును బట్టి మొక్కజొన్న పంటను ఖరీఫ్, రబీలో కూడా సాగు చేయవచ్చు. వాణిజ్యపరంగా ఈ పంటకు మంచి డిమాండ్ ఉంది. , పాప్‌కార్న్ తయారీతో పాటు పశువులు, కోళ్ల దాణా తయారీలో, వివిధ పరిశ్రమల్లో ముడిసరుకుగా దీన్ని వినియోగిస్తుంటారు.

సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మొక్కజొన్న సాగుకు మురుగునీరు పోయే లోతైన ఎర్రగరప, మధ్యస్థ నల్ల నేలలు బాగా అనుకూలం. నేలలో తేమను పట్టి ఉంచే గుణం ఉండాలి. నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో మొక్కజొన్న దిగుబడి సరిగా రాదు. సాధారణంగా 100–120 రోజుల్లో పంట చేతికి వస్తుంది. మధ్యకాలిక రకాలు 90–100 రోజులల్లో, స్వల్పకాలిక రకాలైతే 90 రోజుల లోపే పంట చేతికి వస్తుంది. జీరో టిల్లేజ్ పద్ధతిలో పొలంలో దుక్కి లేకుండా కూడా నాటుకోవచ్చు. పొలంలోని వరి దుబ్బులలోనే గొయ్యి తవ్వి విత్తనం వేసుకోవచ్చు. అప్పటికే పొలంలోని తేమ, ఎరువుల సత్తువతో మొలకలు బాగా వస్తాయి. దుక్కి ఖర్చు లేకుండా విత్తుకోవడంతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.



బిల్లుమడలో మొక్కజొన్న గింజలు ఆరబెడుతున్న

జూన్–జూలైలో ఒక పంట, నవంబర్–డిశంబర్‌లో వరి కోతల అనంతరం రెండవ పంటగా వేసుకోవచ్చు. ఇప్పటికే మొక్కజొన్న పంట కోతలైన పొలాల్లో తిరిగి నాటుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీర్ఘకాల రకాలు పంట

పంట గిట్టుబాటు అవుతోంది



మేము గతంలో ఖర్బూజ సాగు చేశాం. పంట మార్పిడి కింద మొక్కజొన్న సాగు చేస్తున్నాం. ప్రతీ ఏడాది ఎకరన్నర పొలంలో మొక్కజొన్న వేస్తున్నాను. సుమారు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. నేరుగా గ్రామంలోకి వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పంట ఖర్చు తక్కువ కావడంతో గిట్టుబాటుగా మారింది. ఖర్చులు కలిసి వస్తున్నాయి. – కిల్లారి సంజీవరావు, రైతు, ఘనసర, భామిని మండలం

మార్క్‌ఫెడ్ నుంచి అనుమతులు రావాలి



జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సాగు గిట్టుబాటు అవుతుండటంతో పంటసాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మొదటి పంట రైతు చేతికి చేరుతున్నది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. కాని మార్క్‌ఫెడ్ నుంచి పంట కొనుగోలుకు అనుమతులు రావాల్సి ఉంది. పారిశ్రామికంగా జొన్న పంటకు గిరాకీ పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తుండడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకే అధికంగా అమ్మకాలు చేస్తున్నారు. ప్రత్యేక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సాగడం లేదు. – కె.రాబర్ట్ పాల్, వ్యవసాయశాఖ జేడీ, పార్వతీపురం మన్యం జిల్లా

పుష్పశ్రీవాణికి అభినందనల వెల్లువ



పుష్పశ్రీవాణికి అభినందనలు తెలుపుతున్న గుమ్మలక్ష్మీపురం మండల నాయకులు

జియ్యమ్మవలస: మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణికి గుమ్మలక్ష్మీపురం మండల నాయకులు అభినందనలు తెలియజేశారు. పది సంవత్సరాలుగా కుల వివాదంలో నలుగుతున్న ఆమె ఎస్టీ కులానికి చెందినట్లు హైకోర్టు తీర్పు ఇవ్వడంతో కురుపాం నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం చినమేరంగిలోని ఆమె నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, జెడ్పీటీసీ బి.సుజాత, వైస్ ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మథరావు, కురుపాం సర్పంచ్ జి.సుజాత, ఎంపీటీసీ జి.విద్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు. కాగా, పుష్పశ్రీవాణి ఎస్టీ కులానికి చెందినవారు కాదని ఆరోపిస్తూ 2019లో నిమ్మక జయరాజు, నిమ్మక సింహాచలం కోర్టులో కేసు వేశారు. దీనిపై విచారించిన హైకోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

పలువురికి సన్మానం

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో గౌరీపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గ్రామంలోని వివిధ వృత్తుల్లో సేవలందించి ప్రశంసలు అందుకున్న వారిని సన్మానించి సత్కరించారు. ఎన్నో ఏళ్లుగా వైద్యసేవలు అందించి రావివలస పరిసర గ్రామాల ప్రజల ప్రశంసలు అందుకున్న డాక్టర్ వెంగల శివున్నాయుడును, కార్టునిస్టుగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గుంట్రెడ్డి భాస్కరరావు(భాను), ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గుంట్రెడ్డి సత్యనారాయణను, రంప వెంకటరమణమూర్తిని స్థానిక అంబేడ్కర్ కాలనీలో సర్పంచ్ బి.అప్పడు, ఎంపీటీసీ కోట భరత్, గుంట్రెడ్డి బలరాంనాయుడు, తదితరులు ఘనంగా సన్మానించి సత్కరించారు.



శివున్నాయుడును సన్మానిస్తున్న హరిదాసు



కార్టూనిస్ట్ భానును సన్మానిస్తున్న ఎంపీటీసీ భరత్

'చి'వరి' తడుల కోసం..

పాలకొండ రూరల్: మండలంలోని తోటపల్లి సాగునీటి కాలువల టైలాండ్ ప్రాంత రైతులు సాగునీరు అందక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదివరకే తమ సంఘాల నాయకులతో కలిసి స్థానిక సబ్ కలెక్టర్‌కు సాగునీటి సమస్యపై వినతులు అందించారు. ముఖ్యంగా రుద్రిపేట, వెలగవాడ, సిరికొండ, లుంబూరు, ఓని, అదితర ప్రాంతాలకు కాలువల ద్వారా నీరు అందకపోవటంతో ఆయా ప్రాంతాల రైతులు కాలువల ఎగువ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి రైతులు వేసిన అడ్డుకట్టలు తొలగించినా ఫలితం లేకపోయింది. వరి కీలక దశలో ఉన్న ఈ సమయంలో నీటి తడులు అందకుంటే పంట నష్టం తప్పదు. వాతావరణ శాఖ సూచలతో వర్షం పడుతుందని ఎదురు చూస్తున్నారు. నిత్యం సాయంత్రం వేళల్లో ఆకాశంలో మబ్బులు ఊరిస్తున్నాయి తప్ప వర్షం కురవడం లేదు. ఆదివారం కూడా మబ్బులు ఊరించాయి.

గరుగుబిల్లిలో వర్షం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, రావుపల్లి, ఉల్లిబద్ర, గొట్టివలస తదితర గ్రామాలలో ఆదివారం మధ్యాహ్నం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం మెట్టు ప్రాంతాల్లో సాగుచేస్తున్న పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

29న సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 29న ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులంతా ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

● హరివిల్లు కనువిందు



ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండ. సాయంత్రం 4 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో ఆకాశం గర్జిస్తూ ఆదివారం భారీ వర్షం కురిసింది. వర్షం తగ్గిన వెంటనే ఆకాశంలో అందమైన హరివిల్లు ప్రత్యక్షమైంది. ఇంద్రధనస్సును చూస్తూ స్థానికులు ఆనందంతో తబ్బిబ్బైపోయారు. వెంటనే తమ మొబైల్స్‌లో రెయిన్‌బోను బంధిస్తూ మురిసిపోయారు. వీరఘట్టం:

చెరువులు కాదు రోడ్లే..!

- వర్షానికి జలమయమైన రహదారులు
- ప్రమాదకర ప్రయాణంతో వాహన చోదకుల ఆందోళన

ఈ ఫొటోల్లో కనిపిస్తున్నవి చెరువులు కాదు. చెరువులను తలపిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లాలోని రహదారులు. జిల్లాలో శనివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి రహదారి గుంతల్లో నీరు చేరడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి. జిల్లాలో 201.42 కొలోమీటర్ల పొడవున రహదారి మరమ్మతు పనులు చేపట్టడానికి రూ.11.75 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిధుల మంజూరు ప్రకటనలకే పరిమితం కావడంతో ప్రమాదకర ప్రయాణంతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు.

పార్వతీపురంటౌన్



జియ్యమ్మవలస మండలం సీమనాయుడువలస జంక్షన్ వద్ద రహదారి



సీమనాయుడువలస ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్ర వద్ద రహదారి



ఎదమేరంగి కూడలి వద్ద రోడ్డు

ట్రాన్స్ జెండర్ల జీవనోపాధికి చేయూత

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ట్రాన్స్ జెండర్ల జీవనోపాధికి తమవంతు సాయం అందిస్తున్నట్లు మిస్బా వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షిరిన్ ఖాన్ తెలిపారు. ఈమేరకు కురుపాం మండల కేంద్రంలో పలువురు ట్రాన్స్ జెండర్లకు జీవనోపాధి కల్పించేందుకు యస్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంకు చెందిన మిస్బా వెల్ఫేర్ సొసైటీ, మాజీ నేవీ ఉద్యోగులు సంయుక్త సహకారంతో కొబ్బరి కాయలు, పూజా సామాగ్రి అమ్మకం చేసే దుకానంతో పాటు కిరాణా షాప్, హోటల్‌ను (3 యూనిట్లను) ఆదివారం ఏర్పాటు చేయించారు. అందుకోసం అవసరమైన వస్తువులు, నగదును వితరణగా అందించారు. ఈ సందర్భంగా షిరిన్ ఖాన్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. మాజీ నేవీ ఉద్యోగి నగేష్ మాట్లాడుతూ తమ సహకారాన్ని సద్వినియోగించుకుని, మరింత మందికి సాయం అందించేందుకు స్ఫూర్తిని ఇవ్వాలని కోరారు. అనంతరం ట్రాన్స్ జెండర్ గ్రూపు సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిస్బా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అబ్దుల్లా, నేవీ ఉద్యోగులు శిరాజుద్దీన్, ప్రతాప్, తిరుపతిరావు, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ట్రాన్స్ జెండర్ల గ్రూప్ అధ్యక్షులు గీతారాణి తదితరులు ఉన్నారు.



ట్రాన్స్‌జండర్ జీవనోపాధి కోసం ఏర్పాటు చేసిన కొబ్బరి, పూజాసామగ్రి విక్రయ దుకాణం, హోటల్

బీటీరోడ్డు పనులకు భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని ఉరిడి, చిన అంటిజోల గ్రామాలకు మంజూరైన బీటీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం ప్రారంభించారు. గుంజరాడ నుంచి ఉరిడి వరకు సుమారు 2.15 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.5 కోట్లు, గుజ్జువాయి పంచాయతీ మంటికొండ నుంచి చిన అంటిజోల వరకు ఉన్న 1.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.45 కోట్లు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.



ఉరిడి బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఎన్నికల హామీలు ఎప్పుడు అమలుచేస్తారు?

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఆలస్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బరావమ్మ అన్నారు. నాలుగు నెలలైనా హామీల అమలుపై సరైన స్పష్టత లేదని, సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకొండలో ఆదివారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యవ్యతిరేక విధానాలను తూర్పారాపట్టారు. అధికారం కోసం కూటమి కట్టిన పార్టీలు నేడు కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాస్తున్నాయన్నారు. ప్రజలపై ఆర్థిక భారం మోపి ఎంతోకొంత సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తున్న తీరును జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఎండగట్టారు. తీరు మార్చుకోకుంటే ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తామని నిర్ణయించారు. సమావేశంలో కోశాధికారి జి.వెంకటరమణ, జిల్లా నాయకులు అప్పలస్వామి, కాంతారావు, ఇదిర, జ్యోతి, రామలక్ష్మి తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

మున్సిపల్ కార్మికుల ఆందోళన

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు డి.రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించి బలోపేతం చేయాలని, కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని, పనిభారం తగ్గించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ ద్వారా పోరాటాలకు సిద్ధం కావాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెలలో సంతకాల సేకరణ, దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. యూనియన్ నాయకులు వెంకటరావు, వేణు, సురేష్, సంజీవి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



1994 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994లో చదువుకున్న టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం విడిపోయిన వారంతా ఒకరినొకరు చూసుకుని మురిసిపోయారు. ఆత్మీయ పలకరింపులతో తాము చదువుకున్న తరగతి గదిలో సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని తమ పరిచయాలను నెమరువేసుకున్నారు. రోజంతా పాఠశాలలో సందడి చేశారు.

కరుణించమ్మా.. కోటదుర్గమ్మ



పాలకొండ రూరల్: కోటదుర్గమ్మా.. కరుణించమ్మా.. అంటూ భక్తులు చేసిన శరణుఘోషతో పట్టణం మార్మోగింది. పట్టణంలోని బడ్డుకుమ్మరవీధికి చెందిన ప్రజలు ఆదివారం అమ్మవారికి సంబరాలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు ముర్రాటలతో తరలివచ్చి అమ్మవారికి చల్లదనం చేశారు. ఈ క్రమంలో పట్టణంలో మరోమారు దసరా సందడి నెలకొంది.